క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

రాయికల్: మండలంలోని చింతలూరు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య జలదివాసము, ధాన్యదివాసము, పుష్పదివాసం, హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భూమారావు, మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్‌గౌడ్, అర్చకులు శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమపూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పంచామృతాభిషేకం, అఖండ ప్రతిష్ఠ, ప్రధాన కలశస్థాపన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి పాదుకల వితరణ

రాయికల్: మండలంలోని దావన్‌పల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి శనివారం మాలోవత్ వెంకటేష్–రజిత దంపతులు పాదుకలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎం శర్మ ఆధ్వర్యంలో పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గోవిందుల శ్రీనివాస్, హనుమాన్ దీక్షాపరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శోభాయాత్రలు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న స్వాములు

సారంగాపూర్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శనివారం పలు గ్రామాల్లో శ్రీసీతారాముల ఉత్సవ మూర్తులతో అంజనేయస్వామి దీక్షాపరులు, భక్తులు పల్లకిలో ఊరేగింపు సేవ నిర్వహించారు. మంగళవాయిద్యాలు, డీజే సౌండ్‌లో భక్తి పాటలతో ఆంజనేయ స్వామి దీక్షాపరులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి మూర్తులకు మహిళలు ఇంటింటా మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీ



యాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీని నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ హాజరై స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద భారీ ర్యాలీని ప్రారంభించారు. హనుమంతుడి శక్తిని సమాజానికి తెలియజేయడానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేష్, మండల ఉపాధ్యక్షుడు చిలివేరి నవీన్, పట్టణ అధ్యక్షుడు వెంపేట లక్ష్మారెడ్డి, భజరంగ్ దళ్ మండల కన్వీనర్ బండి జైపాల్, పట్టణ కో–కన్వీనర్ గాండ్ల మణికంఠ, నాయకులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

జగిత్యాలఅగ్రికల్చర్/కోరుట్ల/కోరుట్లరూరల్/కోరుట్లటౌన్/రాయికల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్/పెగడపల్లి/మల్లాపూర్/మల్యాల / గొల్లపల్లి: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, పట్టణ కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలు చిత్రపటాలకు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశ ఉప ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో అధికారులు, వివిధ పార్టీల నాయకులు, అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





పొలాస పరిశోధన స్థానంలో నివాళి అర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు, కోరుట్లలో పూలమాలలు వేస్తున్న అధికారులు,నాయకులు



పెగడపల్లి మండల పరిషత్‌లో అధికారుల నివాళి



గొల్లపల్లి: వెంగళాపూర్‌లో గ్రామస్తుల నివాళి



మల్యాల మండల కేంద్రంలో..



ఇబ్రహీంపట్నంలో..



కథలపూర్ మండలం ఇప్పపల్లిలో అధికారుల నివాళి



రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



సారంగాపూర్‌లో ఎస్సై నివాళి



మల్లాపూర్‌లో నాయకుల నివాళి

దళితబంధు సాధన సమితి సభ్యుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కథలాపూర్: ప్రభుత్వం రెండో విడత దళితబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కథలాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితబంధు సాధన సమితి సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. రెండో విడత దళితబంధు లబ్ధిదారుల జాబితాలో పేర్లు ఉన్నవారికి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నియోజకవర్గ అధ్యక్షుడు తీట్ల శంకర్, మండలాధ్యక్షుడు నల్ల గంగారెడ్డి, నాయకులు ఓంకార్, బాల్క సంజీవ్, మారంపెల్లి వినోద్, తరి రమేశ్, తరి రవి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ సాగు శిక్షణకు రైతులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్ అనే రైతు రాజస్థాన్‌లో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే సేంద్రియ వ్యవసాయ సాగు శిక్షణకు హాజరయ్యారు. ఆత్మ ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఒకరిని ఎంపిక చేసి సేంద్రియ వ్యవసాయ సాగు శిక్షణ ఇప్పిస్తున్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



లబ్ధిదారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం శనివారం భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సన్న బియ్యం ఇవ్వడం ద్వారా పేదవారికి పోషకాలు సమృద్ధిగా ఉంటాయని అందుతుందన్నారు. ఈ బియ్యంలో మనిషికి కావలసిన అన్ని రకాల విటమిన్లు ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో జివాకర్ రెడ్డి, ఎంపీడీవో నీరజ, పద్మావతి, తహసీల్దార్ రవికిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేశ్ రెడ్డి, రమేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని 14, 15 వ వార్డుల్లో సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు శనివారం ప్రారంభించారు. నిరుపేదలు కూడా సన్న బియ్యం తినాలన్నదే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా పాలన లక్ష్యమన్నారు. పట్టణంలోని 13, 15, 19 వ వార్డుల్లో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు మచ్చ కవిత, నాయకులు పాల్గొన్నారు.

జై బాపు,జై భీమ్,జై సంవిధాన్‌పై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల: కాంగ్రెస్ కమిటీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పై పట్టణంలోని సినారే కళాభవన్‌లో కోరుట్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నాయకుడు కత్తి వెంకట స్వామి, కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, పీసీసీ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, అవేజ్‌లు నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగం గొప్పదని అందరికీ సమాన హక్కులు, బాధ్యతలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, సత్యనారాయణ గౌడ్, జెట్టి లింగం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

మెట్‌పల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పూదరి నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

కథలాపూర్: మండలంలోని అంబారిపేట, తుర్తి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధానవీధుల గుండా కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తొట్ల అంజయ్య, జవ్వాజి రవి, ఎం.డీ అజీమ్, జవ్వాజి ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి ఏఎంసీ చైర్మన్‌గా రాములుగౌడ్



రాములుగౌడ్



సత్తిరెడ్డి

పెగడపల్లి: పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారైంది. చైర్మన్‌గా బుర్ర రాములుగౌడ్ (నంచర్ల), వైస్ చైర్మన్‌గా సురకంటి సత్తిరెడ్డి (మద్దులపల్లి)ను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా అడుప తిరుపతి, అజ్మీర అంజన్న నాయక్, లింగంపల్లి మహేశ్, సంకిటి శ్రీకాంత్ రెడ్డి, చాట్ల విజయభాస్కర్, తవుటు లావణ్య , దేశెట్టి లక్ష్మీరాజం, శ్రీరాం అంజయ్య, బాలుసాని శ్రీనివాస్, మన్నె గంగరాజం, ట్రేడర్ల నుంచి మ్యాకల మల్లయ్య, చెట్ల కిషన్‌ను నియమించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా నంచర్ల విండో చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, పెగడపల్లి గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రివర్యులు జీవన్‌రెడ్డిలను నూతన పాలకవర్గ సభ్యులు శనివారం జగిత్యాల ఇంద్ర భవనంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీని విప్ అభినందించారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ



ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మానం

మల్యాల: అంబేడ్కర్ జయంతి మండల ఉత్సవ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాక లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా మాదుగుల వెంకటస్వామి, మారంపల్లి లక్ష్మణ్, ముద్దమల్ల స్వామి, ప్రధాన కార్యదర్శిగా మల్యాల ఈశ్వర్, సంయుక్త కార్యదర్శిగా చిట్యాల రాజయ్య, శనిగరపు తిరుపతి, మోత్కుల నర్సయ్య, తోడేటి బాబు, సలహాదారులుగా కండ్లపల్లి గౌతం కృష్ణారావు, బెజ్జంకి నర్సయ్య, నక్క రాజయ్య,గుడిసె రవి, బెజ్జంకి చిన్నదుర్గయ్య, ప్రచార కార్యదర్శి చెవుల మద్ది శ్రీనివాస్, దొనకొండ రమేశ్, నక్క అనిల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సేవాదళ్ సెక్రటరీగా ముఖేశ్ ఖన్నా

జగిత్యాల: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీగా ముఖేశ్ ఖన్నా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాన్ని ముఖేశ్‌కన్నాకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అందజేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు.

ఐకేపీ సెర్ప్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గం

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐకేపీ సెర్ప్ ఏపీఎంల, తెలంగాణ ఐకేపీ సెర్ప్ ఎంప్లాయిస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కోల శ్రీనివాస్ చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా ఆనం శంకర్, ప్రధాన కార్యదర్శిగా నరహరి, సహాయ కార్యదర్శిగా డి.మమత, కోశాధికారిగా వై.రమాదేవిలను ఎన్నుకున్నారు. సలహాదారులుగా చంద్రకళ, రాజయ్యలను నియమించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

సన్న బియ్యం కేంద్రానివే



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: చౌక ధరల దుకాణాల్లో పేద ప్రజలకు అందిస్తున్న సన్నబియ్యం కేంద్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తోందని జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అన్నారు. సన్న బియ్యం పంపిణీ ఘనత తమదేనని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. పెగడపల్లిలో శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఒక్కొరికి ఐదు కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తుందని, దీనికి రాష్ట్రం ప్రభుత్వం తరపున అదనంగా ఒక కిలో జతచేసి ఇస్తుందే తప్పా ఈ పథకం పూర్తిగా తమదేనని మంత్రులు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తు న్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గంగుల కొమురెల్లి,నాయకులు పాల్గొన్నారు.

ప్రధానిని ఏక వచనంతో సంబోధించడం సరికాదు

ధర్మపురి: ప్రధాని నరేంద్రమోదీని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ఏక వచనంతో మాట్లాడం సరికాదని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ అన్నారు. ధర్మపురిలో శనివారం నాయకులతో కలిసి మాట్లాడారు. ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఏక వచనంతో మాట్లాడడంపై తప్పు పట్టారు. 'మోదీ పెట్టవయ్యా పంపవయ్యా' అనే ఏకవచన మాట్లాడారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బండారి లక్ష్మణ్, వైకుంఠం, సురేందర్, దివిటి శ్రీధర్, అయ్యోరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమ్మేళనంలో అల్లాడి ప్రభాకర్‌కు ప్రశంసపత్రం



చెరకు కటింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

మెట్‌పల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో శనివారం ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం జరిగింది. ఇందులో పట్టణానికి చెందిన అల్లాడి ప్రభాకర్ పాల్గొని తాను తయారు చేసిన చెరకు కటింగ్ యంత్రాన్ని ప్రదర్శించాడు. దీనిని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రయోజనం కలిగించే యంత్రాలను రూపొందిస్తున్న ప్రభాకర్‌కు ప్రశంసపత్రం అందించి మంత్రి అభినందించారు.

నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట

వెల్గటూర్ /పెగడపల్లి: ప్రభుత్వం నిరు పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ఎండపల్లి, పెగడపల్లి మండల కేంద్రాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి ఇచ్చిన హామీని నిలుపుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్ రెడ్డి, రాములుగౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి,తహసీల్దార్ రవీందర్, ఏఎస్‌వో నియాంత్, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ శ్రేణులు, రేషన్ దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

వెల్గటూర్: మండలంలోని మొక్కట్రావుపేట గ్రామానికి చెందిన ఎర్రగోకుల పర్లన్న అనారోగ్యంతో బాధపడుతుండగా, చికిత్స కోసం రూ.2.5 లక్షల ఎల్‌వోసీని ధర్మపురి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..

సాక్షి స్పందన




పెగడపల్లి: మండలంలోని బతికపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఆరవెల్లి శివారులోని సుద్దపల్లి బ్రిడ్జి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు గద్దె నిర్మించి వదిలేశారు. దీనిపై 'గద్దె నిర్మించారు..ట్రాన్స్‌ఫార్మర్ మరిచారు' అనే శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు బతికపల్లి సబ్ స్టేషన్ ట్రాన్స్‌కో ఏఈ మధు శనివారం తెలిపారు. లోవోల్టేజీ సమస్యను వెలుగులోకి తెచ్చిన సాక్షికి, విద్యుత్ సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పాఠశాలల్లో వార్షికోత్సవాలు



పాఠశాలల వార్షికోత్సవంలో విద్యార్థుల నృత్యాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్‌లో సాంస్కృతిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పాఠశాలలో వైబ్రన్స్ 2కే25 ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రతిభను ప్రతిభింబించే దేశభక్తి నృత్యాలు ప్రదర్శించారు. అలాగే గ్రామీణ తెలంగాణ జానపద నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రమాదేవి, రజితరావు, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల జోష్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు రజితరావు, అజిత్, సుమన్‌రావు, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

కొమొరెడ్డి రామ్‌లు సేవలు చిరస్మరణీయం

మెట్‌పల్లి: నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం రామ్‌లు రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌అజాద్. తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఎర్రోల హన్మాండ్లు తదితరులున్నారు.

మల్లాపూర్: రాష్ట్ర రాజకీయాల్లోనే దమ్మున్న లీడర్ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు అని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో శనివారం మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు చిత్రపటానికి సత్యంరెడ్డి నివాళి అర్పించారుఆయన మరణం నియోజకవర్గానికి తీరని లోటన్నారు.

కొమొరెడ్డి రాములు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మల్లాపూర్‌లో యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు జవిడి రాజరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, కట్కం గంగారెడ్డి, బైరవేని శశిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.